రాగం: మధ్యమావతి

తాళం: ఆది

చిత్తజగురుడ నీకు శ్రీమంగళం నా
చిత్తములో హరి నీకు శ్రీమంగళం

1. బంగారుబొమ్మవంటి పడతి నురముమీద
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీర బీతాంబరము మొలగట్టుకొని
చెంగలించే హరి నీకు శ్రీమంగళం

2. వింతనీలములవంటి వెలది నీపాదముల
చెంత బుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతులకౌస్తుభమణి గట్టుగ భక్తులకెల్ల
జింతామణివైన నీకు శ్రీమంగళం

3. అరిదిపచ్చలవంటి యంగన శిరసుమీద
సిరులదాల్చిన నీకు శ్రీమంగళం
గరిమ శ్రీవేంకటేశ ఘనసంపదలతోడి
సిరివర నీకు నిదె శ్రీమంగళం